క్లుప్తంగా

కొనసాగుతున్న 'గృహలక్ష్మి' సర్వే

బోథ్: గృహలక్ష్మి సర్వే మండల కేంద్రంలో కొనసాగుతోంది. ఎంపీడీవో సుశీల్ రెడ్డి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఇంటి పన్ను చెల్లించాలని అధికారులు చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. చెల్లించకపోతే పథకానికి అర్హులు కారా అని ప్రశ్నిస్తున్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

బేల: రైతులు పశువులకు కచ్చితంగా గాలికుంటు టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి కాంబ్లే సిద్ధార్థ అన్నారు. బుధవారం మండలంలోని చప్రాల, చంపెల్లి, భవానీగూడ(సి) గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు టీకాల శిబిరం నిర్వహించి, టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ హరీష్, సిబ్బంది పొచ్చన్న, అశోక్, రితేష్, రవీందర్ పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

ఇంద్రవెల్లి: మండలంలోని వడగామ్, వాల్గొండ గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లను బుధవారం ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్‌బూత్‌లోని వసతులపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలున్నా.. తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామాలను సందర్శించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఓటుహక్కు నమోదు, ఈవీఎం యంత్రం ద్వారా ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మెస్రం లక్ష్మణ్, సర్పంచ్‌లు ఆత్రం రత్తుబాయి, జుగాదిరావ్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఓ పాఠశాలలో జాతీయ జెండా ఎగరవేయకపోవడం, మరోచోట తలకిందులుగా ఎగరవేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందించాల్సిన ఉపాధ్యాయులే ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బేల: మండల కేంద్రంలోని గణేష్‌గార్డెన్‌లో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 62 మందికి మంజూరైన చెక్కులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీపీ తాక్రే వనిత గంభీర్, బీఆర్‌ఎస్ నాయకులు సతీష్‌పవార్, ప్రమోద్‌రెడ్డి, బండి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఇచ్చోడ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గత వారం రోజుల నుంచి పట్వారి గూడ రామాలయంలో సంత్‌సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తాహం బుధవారం ముగిసింది. ప్రజలు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, వెంకటేష్, రాథోడ్ ప్రవీణ్, అర్గుల గణేష్, అజీం సుల్తాన్, మహేందర్ రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బేల: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు చెల్లించాలని యూత్ కాంగ్రెస్ నియోజవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్, ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా అధికారికంగా సర్వే చేయించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, వాంఖడే వామన్, ఎండీ అఖిల్, మడావి చంద్రకాంత్, ఘణేశ్యాం, రూప్‌రావు, ఠాక్రే విపిన్, శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో ఆదర్శం

ఇచ్చోడ: ప్రభుత్వ పథకాల అమల్లో ముఖరా(కె) గ్రామం ఆదర్శంగా నిలుస్తోందని తహసీల్దార్ తుకారాం అన్నారు. బుధవారం గ్రామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. వందశాతం ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌ల కృషి అభినందనీయమన్నారు.

క్రీడలకు దూరం



ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం

- జూనియర్ కళాశాలల్లో కానరాని క్రీడలు
- వేధిస్తున్న పీడీల కొరత
- ప్రతిభ చాటలేకపోతున్న విద్యార్థులు



అండర్- 17లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు (ఫైల్)

తలమడుగు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విశాలమైన మైదానాలు ఉన్నా.. ఆస్థాయిలో మాత్రం క్రీడలు ఆడించడం లేదు. ఆటలు ఆడించాల్సిన ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) లేక పోవడమే కారణం. విద్యార్థులకు తరగతి నిర్వహణ లేని సమయంలో ఆటలు ఆడించాల్సి ఉన్నా.. అవి ఎక్కడా అమలు చేయడం లేదు. ఫలితంగా పదో తరగతి వరకు క్రీడల్లో ఉత్తమంగా రాణించిన విద్యార్థులు ఇంటర్‌లో వచ్చే సరికి ఆటలను పూర్తిగా మర్చిపోతున్నారు.

పీడీల కొరత..

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మొత్తం 42 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ల (పీడీ)ల కొరత తీవ్రంగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దాదాపు 6,900 మంది విద్యార్థులు చదువుతున్నారు. 13 కళాశాలల్లో ఒక్క ఫిజికల్ డైరెక్టర్ లేడు. అన్ని కళాశాలలో పీడీల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. తలమడుగు, తాంసి, బేల, గుడిహత్నూర్, ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్‌లో మహిళా బాలికల, బాలుర కళాశాలు ఉన్నాయి. కానీ ఏ మండలంలో కూడా పీడీలు లేరు.

అండర్ 19 ఎస్‌జీఎఫ్‌కు నిర్వహణ భారం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవడంతో ప్రతి ఏడాది నిర్వహించే అండర్ –19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణపై భారం పడుతుంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా మంచిర్యాల జిల్లాలో ఒక్కరూ మాత్రమే ఉన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలో పీడీలు లేక నిర్వహణ భారం పడుతుంది.

క్రీడల్లో వెనుకబడి..

పీడీల కొరతతో జూనియర్ కళాశాలలో క్రీడలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. దీంతో అండర్- 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో విద్యార్థులు రాణించలేక పోతున్నారు. పాఠశాల స్థాయిలో ఎస్‌జీఎఫ్ పరంగా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. పీడీల నియమాకం చేపడితే విద్యార్థులు రాణిస్తారని ఆయా క్రీడాకారులు, సంఘాల ప్రతినిధులు ఘల ప్రతినిధులు కోరుతున్నారు. అలాగే కాంట్రాక్టు పద్ధతిన పీడీలను నియమిస్తే ప్రతిభవంతులకు ఉపాధి దొరుకుతుంది. విద్యార్థులను ప్రోత్సహించినట్లు అవుతుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీడీలను నియమించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పీడీలను నియమించాలి

ఆదిలాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎక్కడా కూడా సరిపడా పీడీలు లేరు. అండర్–14, అండర్– 17 ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాణించే క్రీడాకారులు కళాశాల అండర్– 19 స్థాయిలో రాణించలేకపోతున్నారు. పీడీలు లేకపోవడంతో విద్యార్థులు ప్రతిభ చాటలేకపోతున్నారు.

– మాధవ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్, తలమడుగు

పోస్టులు ఖాళీగా ఉన్నాయి

ప్రభుత్వ జునియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని కళాశాలలో పీడీలు లేక కళాశాలలో విద్యార్థులు ఆటలు ఆడలేకపోతున్నారు. ప్రభుత్వం పోస్టులను భర్తీ చేయాలి. గతంలో ఇంటర్ విద్యాశాఖ కమిషనర్‌కు విన్నవించడం జరిగింది.

– రవీందర్, డీఐఈవో

కుష్ఠు నిర్మూలనకు కృషి చేయాలి



బోథ్: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



ఇచ్చోడ: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

నేరడిగొండ: కుష్ఠు నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ గాదె సమత అన్నారు. బుధవారం మండలంలోని వడూర్‌లో కుష్ఠు నిర్మూలన సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఫయ్యాజ్, వార్డ్ సభ్యుడు అయిటి రమేష్, గంగామణి, సుజాత, పుష్ప పాల్గొన్నారు.

ఇచ్చోడ: కుష్ఠు నిర్మూలన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 16 నుంచి 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, రాజ్‌కిరణ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్: కుష్ఠు వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప సర్పంచ్ కట్ట పల్లవి భూమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. పద్మాపూర్ గ్రామంలో అవగాహన కల్పించారు. కుష్ఠును నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ పందెం సుగుణ పేర్కొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్



పార్టీ కండువా కప్పుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: సీఎం కేసీఆర్ ఉచిత హామీలతో ప్రజలను మోసం చేస్తున్నాడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బేల మండలంలోని రేనిగూడ గ్రామస్తులు పార్టీలో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో దినేష్ మటోలియా, చిలుకూరి జ్యోతి రెడ్డి, లోక ప్రవీణ్‌రెడ్డి, విజయ్, ముకుంద్ పాల్గొన్నారు.

రాంపూర్(బి)లో బీజేపీ పల్లెనిద్ర

సిరికొండ: ఖానాపూర్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు రాథోడ్ బాపురావు మంగళవారం మండలంలోని రాంపూర్(బి) గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఇంటింటికీ ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దేశంలో బీజేపీ సుపరిపాలనా అందిస్తుందని వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. రాత్రి హనుమన్ మందిరంలో నిర్వహించిన హనుమాన్ పారాయణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, ఉప సర్పంచ్ సూర్యవంశీ ప్రహ్లద్, గిరిజన మోర్చా అధ్యక్షుడు మర్స రాజు, దత్తు, దిలిప్, రాజేందర్, కాశీనాథ్, చరణ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం..

సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన ఉట్నూర్ ఎస్సై ప్రదీప్‌కుమార్, ఏఎస్సై సాయన్నలను మండలంలోని దంతన్‌పల్లి ఆటో యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అనీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు హైదర్, బాపురావు, మల్లేశ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఉత్తమ ఎస్సైగా ప్రశంసా పత్రం అందుకున్న ఇంద్రవెల్లి ఎస్సై సునీల్‌ను బుధవారం ప్రధాన్ సమాజ్ సంఘం నాయకులు సన్మానించారు. నాయకులు గేడం భరత్, ఉమేష్, గేడం మహేష్, సోయం మురహరి, మెస్రం శేఖర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొండిబా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకోవడంతో బుధవారం టీటీఎఫ్, ఆర్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆయనను సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతంలో సేవలందిస్తున్న డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్సై ప్రదీప్‌కుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్, జిల్లా అధ్యక్షుడు రవీందర్, ఉత్తం జాదవ్ పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమ్రి గ్రామంలో ఇటీవల దుర్గం లక్ష్మిబాయి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బుధవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ పరామర్శించారు. ఆయన వెంట లాజర్, భరత్, శివ, రాజేశ్, జైపాల్, శ్రీనివాస్, సుధాకర్ ఉన్నారు.

నేరడిగొండ: భవనం పైనుంచి పడి రెండు చేతులు విరిగిన బాధిత మేస్త్రి రామారావును గిరిజన లంబాడాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ పర్మార్శించారు. బుధవారం మండల కేంద్రంలోని బాధితుడి నివాసానికి చేరుకొని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, లైవ్ మండల ఇన్‌చార్జి జాదవ్ పాండు ఉన్నారు.

- మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సోలంకే సుధాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. కాగా బుధవారం బాధిత కుటుంబసభ్యులను ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్ పరామర్శించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 18న ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దండనాయక్ లక్ష్మీకాంత్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు పూర్తి ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

'అరెస్టు చేయడం సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్: సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని టీపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలభోజు గోపికృష్ణలు ఒక ప్రకటనలో అన్నారు. ఉద్యోగులకు టైమ్ పేస్కేల్ ఇవ్వాలని నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఎస్పీడీ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు. సర్వశిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

నార్నూర్: మండలంలోని గుండాల గ్రామంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని బుధవారం హైదరాబాద్‌లోని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును బుధవారం గ్రామానికి చెందిన యువకుడు రాథోడ్ సురేశ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీలకు రైతుబంధు, రైతు భీమా, రుణమాఫీ వంటి పథకాలు అందడం లేదన్నారు. దళితులకు దళితబంధు యూనిట్లు మంజూరు చేయాలన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ఆదిలాబాద్‌టౌన్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజన్న అన్నారు. బుధవారం కళాశాల ఆవరణలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆదిలాబాద్ శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. లెక్చరర్లు క్రాంతి కుమార్, శ్రీనివాస్, విజయలక్ష్మి, జ్యోత్స్న రాణి, రామేశ్వర్ రెడ్డి, సుధాకర్, నీల్‌కమల్, సంగీత, హేమలత, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండ్ల పంపిణీ

బోథ్: గిరిజన సంక్షేమ శాఖ నుంచి 2021 సంవత్సరానికి గాను మండలంలోని 39 మంది లబ్ధిదారులకు ఎడ్లబండ్ల కొనుగోలు కోసం రూపాయలు 29 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఎడ్లబండ్లను కొనుగోలు చేసి ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆదివాసీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ రుణాలు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలమడుగు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీబంధు రుణాలను అర్హులైన బీసీలందరికీ అందేలా చూడాలని మండల బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో రమాకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ వెంకటేశ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆదేశానుసారం రెండో విడత జాబితాలో మండలంలోని 28 గ్రామ పంచాయతీలోని అర్హులైన వారికి అందించాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు కమిటీ చైర్మన్ గోక జీవన్ రెడ్డి, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, దేవపూర్ సర్పంచ్ అబ్దుల్లా, రాజేశ్వర్, దూస సంతోష్, శాస్త్రీ పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం'



గ్రామస్తులతో మాట్లాడుతున్న వన్నెల అశోక్

బోథ్: కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పీసీసీ సభ్యులు వన్నెల అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని నిగిని, కంటేగాం, బాబర్‌తండా, పట్నాపూర్, ఇంకర్‌పల్లె, కరత్వాడ గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. రెండు లక్షలను రుణమాఫీ చేస్తామన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్, నల్ల శ్రీకాంత్ రెడ్డి, సంజీవ్, నిఖిల్, కమలాకర్ పాల్గొన్నారు.

యాదవ యుద్ధభేరి విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వెంకట్ యాదవ్

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో ఈనెల 25న నిర్వహించే యాదవ యుద్ధభేరిని విజయవంతం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు యాదవులు, యాదవ ఉపకులాలకు 22 ఎమ్మెల్యే, 7 ఎమ్మెల్సీ, 5 లోకసభ, రాజ్యసభ సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ గొర్రెలు, బర్రెలు, ఆవుల ఇచ్చి తమను రాజకీయం ఎదగకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇక నుంచి యాదవులు ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవంతో ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రఘువీర్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు ప్రఫుల్ యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు నారాయణ యాదవ్, మహేందర్ యాదవ్, కావటి రమేశ్, అసుర రమేశ్, ఆశన్న, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రేపు విగ్రహావిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఈ నెల 18న నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణను గౌడ కులస్తులు, బీసీ సంఘాల నాయకులు విజయవంతం చేయాలని గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేశ్ చందర్ గౌడ్, అంజన్ గౌడ్‌లు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాట్లాడారు. ముందుగా పట్టణంలోని ఇందిరానగర్ నుంచి ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ చౌక్, నేతాజీచౌక్ మీదుగా బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. సమావేశంలో నాయకులు భూమాగౌడ్, సంతోష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజేశ్వర్ గౌడ్, సాయిచైతన్య గౌడ్, దినేష్ గౌడ్, నరేష్ గౌడ్, సాయి చరణ్ గౌడ్, ప్రణయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



గుడిహత్నూర్‌లో..

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయలో దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి దేశ అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీం రెడ్డి, కొల్లూరి చంద్రశేఖర్, రాములు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: దేశానికి వన్నె తెచ్చిన నాయకుడు భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ భరత్, సుధాకర్ ముండే, కొండిబా, కేంద్రే శివ, శ్రీధర్, పాండురంగ్, రాజు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో అటల్ బిహారీ వాజపేయి వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్, జాతీయ నాయకులు శ్రీరాం నాయక్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్ మాట్లాడుతూ.. దేశ హితం కోసం పాటుపడారని, దేశ రక్షణే ధ్యేయంగా పని చేశారని కొనియాడారు. దేవిదాస్, గాలి శ్రీకాంత్, విజయ్, నిఖిల్‌రెడ్డి, జగన్, యోగేశ్, రవి, వెంకటేశ్, రాజు, వినోద్ పాల్గొన్నారు.

'మాదిగలపై కలెక్టర్ వివక్ష'



విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: మాదిగలు, దాని ఉప కులాలపై కలెక్టర్ వివక్ష చూపుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేశ్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జైనథ్ మండలంలోని పుసాయిలో దళితుడైన అశోక్ ఇల్లు కాలిపోయిన ఘటనలో కట్టుబట్టలతో ముగ్గురు ఆడ పిల్లలను తీసుకోని రోడ్డున పడితే వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోలేదన్నారు. బజార్‌హత్నూర్ మండంలోని కినర్‌పల్లిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ.. ఎంతో మంది మృత్యువాత పడుతున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలో భీమన్న గుట్ట వద్ద 2007 దళితుల కోసం ఇంటి స్థలాలు కేటాయిస్తే వాటిని ఇతరులకు అప్పగించారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బరుకుంట సుభాష్, మండల అధ్యక్షుడు చిటి రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూములను పరిరక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న జామమసీదు కమిటీ సభ్యులు

బేల: బేలలోని కోట్ల విలువ చేసే జామ మసీద్ ఇనాం భూములను పరిరక్షించాలని జామ మసీద్ కమిటీ అధ్యక్షుడు షకీల్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి షహేజాద్‌లు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ వేణుగోపాల్‌కు, ఎస్సై రాధికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం వక్ఫ్ బోర్డు కింద జామ మసీదు సేవల కోసం ఖాజీలకు ఇనాం భూములను కేటాయించిందన్నారు. బేలలో సర్వే నంబరు 46లో 13 ఎకరాల 17గుంటల భూమిని నవాబుద్దిన్ ఖాజీకి కేటాయించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యక్తి మసీదులో ఎటువంటి సేవలు చేయడం లేదన్నారు. పాత కమిటీ సభ్యుల నిర్లక్ష్యంతో భూమిని ఏడేళ్ల క్రితమే ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసి, ప్రస్తుతం అమ్మడానికి సిద్ధపడుతున్నారని ఆరోపించారు. వీటిని పరిరక్షించాలని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు అక్తార్, సిరాజ్, జహుర్, సానఖాన్, సాదిక్, మహబుబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899